సాక్షి
తిరుపతి
మంగళవారం । 28 । జనవరి । 2025



శోత్రియం భూముల్లో గూడుపురాణి!

శోత్రియం భూముల్లో గూడు పురాణి రేగుతోంది. పికారీల ముసుగులో కొందరు ఆక్రమణల పరంపర కొనసాగిస్తున్నారు. - 8లో



రథసప్తమి ఏర్పాట్ల పరిశీలన

తిరుమల శ్రీవారి ఆలయంలో ఫిబ్రవరి 4న జరగనున్న రథసప్తమి ఏర్పాట్లను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పరిశీలించారు. - 8లో



స్కూళ్లపై పర్యవేక్షణకు క్లస్టర్ విధానం

స్కూళ్లపై పర్యవేక్షణకు నూతనంగా క్లస్టర్ విధానాన్ని తీసుకొస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పేర్కొన్నారు. - 8లో

ఇదేం మెలిక?

వరి ధాన్యం కొనుగోలులోనూ కూటమి ప్రభుత్వం రైతుల సహనాన్ని పరీక్షిస్తోంది. అరకొర ధాన్యం కొనుగోలు చేసి మిగిలిన మొత్తాన్ని దళారులకు దోచిపెట్టేందుకు సిద్ధమైంది. సాగు విస్తీర్ణాన్ని బట్టి.. దిగుబడిని అంచనా వేసి ధాన్యం కొనుగోలు చేయాల్సింది పోయి ఈ ఏడాది 20 టన్నులు మాత్రమే కొనుగోలు చేయాలని మెలిక పెట్టడం విమర్శలకు తావిస్తోంది. గిట్టుబాటు ధరతో ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని రైతాంగం డిమాండ్ చేస్తోంది.



వరి ఒబిళ్లు షురూ

ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- జిల్లాలో 2.2 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు
- ఈ సారి 6 లక్షల టన్నుల వరకు దిగుబడికి అవకాశం
- అయితే 20 వేల టన్నుల కొనుగోలుకు మాత్రమే అనుమతి
- మిగిలిన 5.8 లక్షల టన్నుల మాటేంటో?
- దళారులకు కొమ్ముకాస్తున్న కూటమి ప్రభుత్వం
- విమర్శలు ఎక్కుపెడుతున్న రైతాంగం

తిరుపతి అర్బన్: జిల్లాలో ధాన్యం కొనుగోలుకు కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గతంలో మాదిరిగానే రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయనుంది. పంట సాగుకు సంబంధించి ఈకేవైసీ చేయించుకున్న రైతుల వద్దనే ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. మార్చి 31వ తేదీ వరకు వరి ధాన్యం కొనుగోలు చేస్తామని సంబంధిత సివిల్ సప్లయ్ అధికారులు పేర్కొంటున్నారు.

మార్చి 31 వరకు కొనుగోలు

మార్చి 31 వరకు మాత్రమే వరి ధాన్యం కొనుగోలు చేస్తామని సివిల్ సప్లయ్ అధికారులు సంకేతాలు ఇస్తున్నారు. సాధారణంగా జనవరి చివరి నుంచి వరి ఒబ్బిళ్లు మొదలు పెడుతారు. మే 31 వరకు ఇవి కొనసాగుతాయి. అయితే మార్చి 31 వరకు కొంటే ఆ తర్వాత వచ్చే ధాన్యం ఎవరికి విక్రయించాలని రైతాంగం ప్రశ్నిస్తోంది.

8 రకాలు మాత్రమే కొనుగోలు

జిల్లాలో 20 రకాల వరి వంగడాలు సాగు చేశారు. అయితే ఎన్ఎల్ఆర్ 3892, 34449 రకాలు, కేఎన్ఎం 1638, 733 రకాలు, ఆర్ఎన్ఆర్ 15048 రకాలు, బీపీటీ 5204, 2782 రకాలు, ఎంటీయూ 1156, 1271, 1224, 1010 రకాలు మాత్రమే అధికారులు కొనుగోలు చేయనున్నారు. మిగిలిన రకాలకు నో చాన్స్.

ఆ ధాన్యం సంగతేంటో?

జిల్లా వ్యాప్తంగా 2.2 లక్షల ఎకరాల్లో వరి పంట సాగవగా.. ఎకరాకు 3 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఈ లెక్కన మొత్తం 6,00,060 టన్నుల వరకు దిగుబడి వస్తుందని అంచనా. అయితే కూటమి ప్రభుత్వం 20 వేల టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన 5.8 లక్షల టన్నుల వరి ధాన్యం మాటేంటో తెలియడం లేదు. దీనిపై రైతులు విరుచుకుపడుతున్నారు. అరకొర ధాన్యం కొనోగులు చేయడం ఏంటని మండిపడుతున్నారు. ఈ సారీ దళారులపైనే ఆధారపడాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందుతోంది. ఇందిలావుండగా ఏటా శ్రీకాళహస్తిలోని ఏపీసీడ్స్ వారు ముందుగా వరి విత్తనాలు ఇచ్చి.. తిరిగి 80 టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేస్తుంటారు. అయినప్పటికి 5 లక్షల టన్నుల వరి ధాన్యం మిగులుతుంది. ఈ ధాన్యం దళారుల నేతృత్వంలో ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకే విక్రయించాల్సి వస్తోంది. ఈ సారి సాగు విస్తీర్ణం పెరగడం.. తక్కువ మొత్తంలోనే ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో దళారులు రాజ్యమేలడం ఖాయంగా కనిపిస్తోంది.

అంతా గోప్యమే

వరి ధాన్యం కొనుగోలు చేయడంలో అధికారులు అంతా గోప్యంగానే ఉంచుతున్నారు. పబ్లిసిటీ అయితే ఆ స్థాయిలో కొనుగోలు చేయడానికి అవకాశం లేదని సైలెంట్‌గా కొనుగోలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ముందుగా సర్కార్ ఈ రేట్లుకు వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. ఎందుకుంటే 6 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయలేమని ఇప్పుడే చేతులెత్తేస్తున్నారు.

పెంచని ధర

రెండేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రేడ్‌–ఏ రకం వరి ధాన్యం టన్ను రూ.2,320, సాధారణ రకం రూ.2,300కు కొనుగోలు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం కూడా అదే ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ప్రతి ఏటా టన్నుకు రూ.200 పెంచాల్సి ఉంది. ఈ లెక్కన రెండేళ్లకు టన్నుపై రూ.400 పెంచాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.


కొనుగోలు చేయకపోవడంతో రోడ్లపైనే వరి ధాన్యం

క్వింటాకు రూ.2,700 ఇవ్వాలి



ప్రైవేటు వ్యాపారులే క్వింటా వరి రూ.2 వేలు వరకు కొనుగోలు చేస్తున్నారు. అందులో నెమ్ముతోపాటు జల్లు, మట్టి కొంత మేరకు ఉంటాయి. అయినా 75 కిలోల బస్తాకు రూ.1,450 ఇస్తున్నారు. 100 కిలోలు అయితే రూ.1,950 నుంచి రూ.2 వేలు ఇస్తారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొనుగోలు చేసే ధాన్యం నెమ్ము, మట్టి, చెత్త ఏమీ లేకుండా అత్యంత శుభ్రంగా ఉండాలి. అలాంటప్పుడు క్వింటాకు రూ.2,700 చొప్పున ఇస్తే రైతుకు గిట్టుబాటు అవుతుంది.

– వీర రాఘవులు, కనమనంబేడు గ్రామం, బీఎన్‌కండ్రిగ మండలం

ధాన్యం మొత్తం కొనాలి



ప్రైవేటుగా వరి ధాన్యం అమ్మాలంటే ఓ వైపు సరైన ధరలు లేవు. మరోవైపు తూకాల్లో మోసాలు తెలిసిందే. ఈ క్రమంలో క్వింటా ధర కనీసం రూ.2,650కి తక్కువ లేకుండా ఇస్తేనే రైతుకు గిట్టుబాటు ఉంటుంది. మరోవైపు రైతులందరి నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతున్నాం. కొనుగోలు చేసిన తర్వాత జాప్యం లేకుండా డబ్బులు రైతు ఖాతాల్లో జమచేయాలి.

–రాజశేఖర్, పెనుమల్లం, ఏర్పేడు మండలం

అందరికీ ఈకేవైసీ చేశాం



వ్యవసాయశాఖ ఆధ్వరంలో 99శాతం పంట ఈ క్రాప్ పూర్తి చేస్తాం. మరోవైపు ఏ రైతు అయితే తమ పంటను విక్రయించాలని భావిస్తున్నారో వారందరి పంటను ఈకేవైసీ చేశాం. ఇక వారు ప్రభుత్వానికి విక్రయిస్తారో.. ప్రయివేటుగా విక్రయిస్తారో వారి ఇష్టం.

–ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

రెండు మూడు రోజుల్లో కొనుగోలు



రెండు మూడు రోజుల్లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభిస్తాం. వరదయ్యపాళెం మండలంలో ఓ రైతు నుంచి ట్రయల్ రన్ ప్రక్రియను చేపట్టాం. 20 వేల టన్నులు కొనుగోలు చేయమని ఉత్తర్వులు వచ్చాయి. ఆ తర్వాత స్థానిక పరిస్థితులను బట్టి కొనుగోలు చేస్తాం.

– వై.సుమతి, జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్

న్యూస్‌రీల్

అమ్మవారి ఆలయ అభివృద్ధికి చర్యలు


నాలుగు మాడ వీధుల్లో పర్యటిస్తున్న ఈఓ శ్యామలరావు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ అభివృద్ధికి కార్యాచరణ చేపట్టాలని టీటీడీ ఈఓ శ్యామలరావు అధికారులను ఆదేశించారు. టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, అధికారులతో కలిసి ఆయన సోమవారం ఆలయ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీటీడీ విజన్‌లో భాగంగా తిరుచానూరు ఆలయ పరిసరాలలో భక్తులలో మరింత భక్తి భావం, ఆహ్లాదాన్ని పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు సమన్వయంతో మరింత ఆకర్షణీయంగా, సౌకర్యవంతంగా ఉండేలా ఆర్కిటెక్చర్ నిపుణుల సహకారంతో మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని సూచించారు. తోళప్ప గార్డెన్‌లోని కల్యాణ మండపాలను నిర్మించి ఇప్పటికే 60 ఏళ్లు పూర్తయినట్టు అధికారులు ఈఓకు నివేదించారు. ఆ తర్వాత ఫ్రైడే గార్డెన్‌ను పరిశీలించారు. ఎఫ్ఏ అండ్ సీఏఓ బాలాజీ, సీఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, టౌన్ ప్లానింగ్ ప్రత్యేక అధికారి రాముడు, ఏవీఎస్ఓ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సినీ నటుడు ఠాకూర్ అనూప్ సింగ్


సినీ నటుడు ఠాకూర్ అనూప్ సింగ్

తిరుమల: తిరుమల శ్రీవారిని సోమవారం సినీ నటుడు ఠాకూర్ అనూప్ సింగ్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా.. టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

ఆత్మస్థైర్యంతో రాణించాలి


సదస్సులో ప్రసంగిస్తున్న వీసీ వీ.ఉమ

తిరుపతి సిటీ: సవాళ్లకు ఎదురొడ్డి ఆత్మస్థైర్యంతో రాణిస్తే లక్ష్యం సులభతరమవుతుందని వీసీ ప్రొఫెసర్ వీ.ఉమ పేర్కొన్నారు. సోమవారం మహిళా వర్సిటీ సోషల్ వర్క్ విభాగం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఉమెన్ ఇన్ కాన్టెంపరరీ సోషల్ రీమ్ ఎమర్జింగ్ స్టేటజీస్ అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించి ప్రసంగించారు. ప్రాచీన కాలం నుంచి నేటి వరకు సమాజంలో స్త్రీ సాధికారత సాధనలో సమస్యలు, సవాళ్లు ఉన్నాయని, వాటిని అవకాశాలుగా మలచుకుని మహిళలు అన్ని రంగాలలో రాణించాల్సి ఉందన్నారు. అనంతరం ఎస్వీయూ న్యూట్రిషియన్ విభాగం ప్రొఫెసర్ కేవీ సుచరి మాట్లాడుతూ పట్టుదలతో రాణిస్తే స్త్రీ సాధించలేనిది ఏమీ లేదన్నారు. సదస్సులో సోషల్ వర్క్ విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ తవిత తులసి, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, దేశం నలుమూలల నుంచి విద్యావేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వందో ప్రయోగానికి రెడీ!

రేపు జీఎస్ఎల్వీ ఎఫ్‌-15 రాకెట్ ప్రయోగం

- నేడు ఎంఆర్ఆర్, ల్యాబ్ సమావేశం
- నావిక్ సిరీస్‌లో రెండో ఉపగ్రహం


నావిక్‌-02 ఉపగ్రహం


షార్‌లోని రెండో ప్రయోగ వేదికపై విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న జీఎస్ఎల్వీ ఎఫ్15 ఉపగ్రహ వాహకనౌక

సూళ్లూరుపేట: సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఈనెల 29వ తేదీ వందో ప్రయోగానికి అంతా సిద్ధం చేశారు. జీఎస్ఎల్వీ ఎఫ్‌–15 రాకెట్ ద్వారా 2,250 కిలోల బరువు కలిగిన నావిక్‌–02 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపేందుకు సన్నాహాలు పూర్తిచేశారు. షార్‌లోని మొదటి వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (వ్యాబ్)లో మూడు దశల రాకెట్ అనుసంధానాన్ని పూర్తిచేసి ఉంబ్లికల్ టవర్ (ప్రయోగవేదిక)కు అనుసంధానించారు. సోమవారం మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశం నిర్వహించారు. రాకెట్‌ను సిద్ధంచేసి ప్రయోగ పనులను లాంచ్ ఆథరైజేషన్ బోర్డు (ల్యాబ్)కు అప్పగించారు.

బుధవారం ఉదయం 6.23కు ప్రయోగం

లాంగ్ ఆథరైజేషన్ బోర్డు వారు లాంచ్ రిహార్సల్స్ నిర్వహించి మంగళవారం తెల్లవారు జామున 2.53 కౌంట్‌డౌన్, బుధవారం ఉదయం 6.23 గంటలకు ప్రయోగాన్ని నిర్వహించనున్నట్టు ప్రకటించారు. జీఎస్ఎల్వీ ఎఫ్15 రాకెట్ ప్రయోగ సమయంలో 420.7 టన్నుల బరువుతో భూమి నుంచి నింగికి బయలుదేరనుంది. 2,250 కిలోలు బరువు కలిగిన నావిక్‌–02 ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. ఈ ప్రయోగాన్ని 19.17 నిమిషాల్లో పూర్తి చేయనున్నారు. జీఎస్ఎల్వీ ఎఫ్‌–15 ప్రయోగం వందో ప్రయోగం. పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన క్రయోజనిక్ ఇంజిన్‌లతో 11వ ప్రయోగం. ఇస్రో చైర్మన్‌గా డాక్టర్ వీ నారాయణన్ బాధ్యతలు చేపట్టాక మొదటి ప్రయోగం కావడం విశేషం.

నిమ్మ ధర ఢమాల్

- కిలో రూ.30 నుంచి రూ.40 వరకే


ఎగుమతి చేసేందుకు గ్రేడింగ్ చేసిన నిమ్మ కాయలు

చిల్లకూరు: నిమ్మ ధరలు పడిపోయాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. దేశ రాజధాని ఢిల్లీ మార్కెట్టుకు పలు ప్రాంతాల నుంచి నిమ్మకాయాలు ఎగుమతి అవుతుంటాయి. కానీ అక్కడి వ్యాపారులు, కొనుగోలుదారులు ఎక్కువగా గూడూరు ప్రాంతంలోని నిమ్మ కాయలనే కొనుగోలు చేస్తుంటారు. ఇక్కడి వ్యాపారులు కూడా ఢిల్లీ మార్కెట్టుపైనే ఎక్కువగా ఆధారపడుతుంటారు. అయితే ఇటీవల నిమ్మ మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడ్డారు. బయట ప్రాంతాల నుంచి తక్కువ ధరలకు నిమ్మ కాయలను దిగుమతి చేసుకుంటున్నారు. గూడూరు నిమ్మ పేరుతో వాటిని ఎగుమతి చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ క్రమంలో వ్యాపారుస్తులు నిర్ణయించిన ధరలకే నిమ్మను విక్రయించుకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

తల్ల'ఢిల్లి'పోతోంది!

గత ఏడాది ఇదే జనవరిలో కిలో నిమ్మకాయలు రూ.70 వరకు పలికాయి. అయితే ఈ ఏడాది జనవరి నుంచి ఒడిదుడుకుల మధ్య కిలో రూ.30 నుంచి రూ.40 మధ్య మాత్రమే పలుకుతోంది. ప్రస్తుతం ఢిల్లీలో ఒక వైపు ఎన్నికల జోరు, మంచు విపరీతంగా కురుస్తుండడంతో అక్కడకు తక్కువగా ఎగుమతులు జరుగుతున్నాయి. రైతులు నిమ్మ కాయలు వచ్చే సమయంలో ఇలా ధరలు పడి పోతే నష్టాలు చవిచూడాల్సిందేనని పలువురు ఆవేదన చెందుతున్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 74,466 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,677 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.67 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 6 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని లోనికి అనుమతించబోమని స్పష్టం చేసింది.

ప్రతి అర్జీకి పరిష్కారం

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌కు ఇచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు 261 అర్జీలు వచ్చాయి. అందులో 158 అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే ఉన్నాయి. జేసీ మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలను వాయిదాలు వేయకుండా ఇక్కడే పరిష్కరించాలని చెప్పారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి అవసరమైన డాక్యుమెంట్స్‌తో కూడిన వివరాలను అర్జీదారులకు అందజేయాలని సూచించారు. డీఆర్వో నరసింహులు, డెప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, సుధారాణి, రోజ్‌మాండ్ అర్జీలను స్వీకరించారు. తిరుచానూరుకు చెందిన శ్రీదేవి అనే మహిళ తమకు న్యాయం చేయాలంటూ ఓ వినతిపత్రాన్ని అందించారు. తన ఇంటిని కొందరు రిజిస్ట్రేషన్ చేయించుకుని, డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నారని పేర్కొన్నారు.

అర్జీల మోత

కలెక్టరేట్ ప్రాంగణంలో ఎక్కడ చూసినా అర్జీలు రాసేవారే కనిపించారు. ఆ మేరకు తమ సమస్యలను అధికారులకు తెలియజేశారు. అయితే గతంలో అర్జీలను రాసి ఇవ్వడానికి ప్రత్యేకంగా వీఆర్వోలను ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవు.

తోపుడు బండ్ల వ్యాపారులకు న్యాయం చేయండి

తోపుడు బండ్లతో వ్యాపారం చేసుకుంటున్న వారికి న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద చిరు వ్యాపారులతో కలిసి ధర్నా చేపట్టారు. తిరుపతి నగరంలో పెద్ద హోటల్స్ జోలికి వెళ్లకుండా చిరు వ్యాపారులను వేధిస్తున్నారని చెప్పారు. చిరు వ్యాపారులపై మున్సిపల్ అధికారులు వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో 7వేల మంది తోపుడుబండ్లతో వ్యాపారం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.


అర్జీలను పరిశీలిస్తున్న జేసీ శుభం బన్సల్


గ్రీవెన్స్ వద్ద అర్జీదారుల రద్దీ


సీఐటీయూ మద్దతుతో తోపుడు బండ్ల వ్యాపారుల నిరసన

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం


మృతుడి భార్య సరితకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైం : తిరుపతి జిల్లా సాయుధ బలగంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ లక్ష్మీపతి ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు భావించారు. ఇందులో భాగంగా సోమవారం ఎస్పీ కార్యాలయంలో మృతుడి భార్య సరితకు రూ.లక్ష చెక్కు అందజేశారు.

హత్య కేసులో ఇద్దరికి రిమాండ్


ముద్దాయిలను మీడియా ముందు ప్రవేశ పెట్టిన సీఐ రవీంద్ర, ఎస్‌ఐ వెంకటేష్

నాగలాపురం: ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవీంద్ర తెలిపారు. ఈ మేరకు మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 25వ తేదీ పిచ్చాటూరు మండలం, జి.ఎ స్.పురం గ్రామానికి చెందిన సుగంధి ఇరుగువాయి గ్రామానికి చెందిన తన ప్రియుడు అరుల్ రాజ్‌తో కలిసి తన భర్త ఆంటోనిని హత్య చేసినట్లు తెలిపారు. హత్యకు కారణమైన వీరిద్దరి మీద గాలింపు చర్యలు చెపట్టగా వీరిద్దరూ నారాయణవనం మండలంలోని కైలాశ కోనలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం తెలిసిందన్నారు. ఈ మేరకు ఎస్‌ఐ, సిబ్బందితో వెళ్ళి సుగంధి(30), అరుల్ రాజ్(35ను అదుపులో తీసుకున్నట్లు పేర్కొన్నారు. హత్యకు ఉపయోగించిన ఉరి తాడు, అరుల్‌రాజ్ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇద్దరినీ సోమవారం మీడియా ముందు ప్రవేశపెట్టి సత్యవేడు కోర్టులో హాజరు పరిచి రిమాండుకు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

శ్రోత్రియం భూముల్లో గూడు పుఠాణి రేగింది. షికారీల ముసుగులో కొందరు ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. రూ.20 వేలకే గుడిసెలు వేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. షికారీల్లో ఓ నాయకురాలు ప్లాట్లకు పట్టాలు తీసిస్తానంటూ నమ్మించి బోల్తా కొట్టిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.


చిన్న పాండూరు శ్రోత్రియం భూముల్లో అక్రమంగా వెలసిన గుడిసెలు

శ్రోత్రియం భూముల్లో గూడుపుఠాణి!

షికారీల ముసుగులో ఆక్రమణలు

- రూ.20 వేలు ఇచ్చుకో.. గుడిసె వేసుకో
- రాత్రికిరాత్రే పుట్టుకొస్తున్న అక్రమ గుడిసెలు
- షికారీల యూనియన్ నాయకురాలి ఆధ్వర్యంలో దందా
- మోసపోతున్న బాధితులు
- ప్రేక్షక పాత్ర పోషిస్తున్న రెవెన్యూ

వరదయ్యపాళెం: మండలంలోని శోత్రియ భూముల్లో గూడు పుఠాణీ నడుస్తోంది. ఏకంగా ప్రభుత్వ భూమిని రియల్ వ్యాపారంగా మార్చేసి జేబులు నింపుకుంటున్నారు. షికారీల ముసుగులో జరుగుతున్న ఈ దందా ద్వారా వందలాది మంది బాధితులు మోసపోతున్నారు. ఏకంగా రూ.20 వేలు ఇస్తే గుడిసె వేసుకునేందుకు వెసులుబాటు కల్పిస్తున్నారు. చిన్న పాండూరు పంచాయతీ, పాదిరికుప్పం రెవెన్యూలోని సర్వే నం.1 నుంచి 84 వరకు 1,056 ఎకరాల శోత్రియ భూములున్నాయి. ఈ భూముల్లో షికారీలు కొద్ది రోజులుగా ఆక్రమణలు చేసుకుని దర్జాగా రియల్ వ్యాపారం మొదలెపెట్టేశారు.

ఆక్రమించి..పంటలు సాగుచేసి

సత్యవేడు–చిన్న పాండూరు ప్రధాన రోడ్డుకు ఆనుకుని వీకేఆర్‌వై కాలనీ సమీపంలోని వందలాది ఎకరాల శోత్రియం భూముల్లో అక్రమార్కులు పాగా వేశారు. దీంతో ఆక్రమిత భూముల్లో దర్జాగా పంట సాగుచేస్తున్నారు. రెవెన్యూ అధికారులు మాత్రం మొక్కుబడిగా హెచ్చరిక బోర్డులు పెట్టి చేతులు దులుపుకున్నారు.

ఏడేళ్లుగా ఆక్రమణ

చిన్న పాండూరు సమీపంలోని శోత్రియం భూముల్లో ఏడేళ్లకు పైగా షికారీలు గుడిసెలు ఏర్పాటు చేసుకుని ఆక్రమణలకు పాల్పడుతున్నారు. మొదటగా ఓ పది మంది షికారీలు 2017–18 సమయంలో తమ పూర్వీకులు ఈ ప్రాంతంలో ఉండేవారని, ఆ కారణంగా సంబంధిత భూములు తమకు చెందినవని ఒక్కొక్కరుగా చిన్నపాటి గుడిసెలతో ఆక్రమణలకు పాల్పడ్డారు. అయితే 2018కి 50 గుడిసెలు అక్రమంగా ఏర్పాటు కావడంతో ఆ సమయంలో రెవెన్యూ వారు పోలీసుల సహకారంతో గుడిసెలన్నీ పూర్తిగా తొలగించారు. మరళా ఓ 20 రోజుల పాటు సంయమనం పాటించిన షికారీలు యథావిధిగా మరోమారు అక్రమ గుడిసెల ఏర్పాటుకు పూనుకున్నారు. దీంతో ఆ అక్రమణలు నేటికీ షికారీలతో పాటు అదనంగా మరో 200 మందికి పైగా అక్రమ గుడిసెలు వెలిశాయి. ఈ ఆక్రమణల పరంపర కొనసాగుతూనే ఉంది.

ఖాళీగా జాగా..వేసేయ్ పాగా!

శోత్రియ భూముల్లో షికారీలు కొందరు ఆక్రమించుకుని మొదటగా గుడిసెలు వేసుకున్నారు. ఆ ప్రాంతాన్ని నక్కలమిట్టగా నామకరణం చేసుకున్నారు. ఆక్రమణలు కాస్త మితిమీరాయి. ఆ ప్రాంతంలో హీరో, అపోలో లాంటి ప్రముఖ పరిశ్రమలు రావడంతో ఆ భూమికి ఎక్కడా లేనంత విలువ పెరిగింది. అందరి కళ్లు ఆ భూములపైన పడ్డాయి. దీన్ని అదునుగా భావించిన షికారీల ముసుగులో ఉన్న నాయకురాలు ఏకంగా ఆ భూములను అమ్మకానికి మొదలు పెట్టారు. రూ.20 వేలకు ఒక్కో ప్లాటును విక్రయిస్తున్నారు. పైగా అమ్మిన భూమికి పట్టాలు తీసిస్తామంటూ మాయమాటలతో బురిడీ కొట్టిస్తున్నారు. ఆమె మాటలు నమ్మి 200 మందికి పైగా రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు ముట్టజెప్పారు. ఆపై అక్రమంగా గుడిసెలు వేసుకున్నారు. ప్రస్తుతం ఆమె పట్టాలు తీసి ఇవ్వకపోవడంతో ఇదంతా బూటకపు గూడుపుఠాణీ అంటూ బాధితులు వాపోతున్నారు. తమ సొమ్ము వెనక్కి ఇవ్వాలంటూ మొరపెట్టుకుంటున్నారు. ప్రభుత్వానికి చెందిన భూముల్లో ప్రైవేటు వ్యక్తుల దందా చేపట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రెవెన్యూ ప్రేక్షక పాత్ర

శోత్రియ భూముల్లో ఓ వైపు భూ ఆక్రమణలు చేసి వందలాది ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. మరోవైపు వందలాది ఎకరాల్లో అక్రమంగా గుడిసెలు వేసి దందా చేస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన రెవెన్యూ అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. రోజూ వారి కంటపడుతున్నా తమ కళ్లకు కనిపించనట్లు వ్యవహరిస్తున్నారు. వీటన్నింటిలో వారి పాత్ర ఏమైనా ఉందా..? అంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటాం



శోత్రియం భూముల్లో అక్రమంగా గుడిసెల ఏర్పాటుపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూములను అక్రమంగా బయట వ్యక్తులకు విక్రయించడం వంటి విషయాలు తమ దృష్టికి రాలేదు. వాటిపై అక్కడ ఏర్పాటు చేసిన గుడిసెల వారితో విచారణ చేపడుతాం. అలా ఆక్రమణలకు పాల్పడినట్లయితే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
–రాజశేఖర్, తహసీల్దార్, వరదయ్యపాళెం మండలం


పాండ్రవేటి రవికుమార్‌రెడ్డికి ఆత్మీయ నివాళులర్పిస్తున్న టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, పాండ్రవేటి స్నేహితులు

ఆత్మీయ నివాళి

తిరుపతి కల్చరల్: పాండ్రవేటి రవికుమార్ రెడ్డికి పలువురు స్నేహితులు, ఆత్మీయులు పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆత్మీయంగా నివాళులర్పించారు. సోమవారం సాయంత్రం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో జరిగిన సంతాప కార్యక్రమానికి తన చిన్ననాటి స్నేహితుడు, టీటీడీ మాజీ చైర్మన్, తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాండ్ల వేటి రవి కుమార్‌రెడ్డితో తనకున్న స్నేహ బంధాన్ని భూమన గుర్తుచేసుకున్నారు. అలాగే పలువురు పాండ్రవేటి రవికుమార్‌రెడ్డి మంచితనాన్ని కొనియాడారు. మేయర్ డాక్టర్ శిరీష, పలువురు ఆత్మీయలు, స్నేహితులు హాజరయ్యారు.

డీడీఈ పరీక్షల నిర్వహణపై విస్తృత చర్చ

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి సిటీ: ఎస్వీయూలో వచ్చే నెల 3వ తేదీ నుంచి జరగనున్న డీడీఈ పరీక్షా కేంద్రాలను ప్రైవేటు విద్యాసంస్థల్లో నిర్వహిస్తే జరిగే పరిణామాలపై 'కాసులు ముట్టాయా...కాపీ కొట్టొచ్చా' శీర్షికన సాక్షి దిన పత్రికలో ప్రచురితమైంది. దీంతో ఉన్నత విద్యామండలి, ఎస్వీయూ అధికారులను డీడీఈ పరీక్షల నిర్వహణపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం. దీంతో హుటాహుటిన వర్సిటీ అధికారులు ఎస్వీయూ పరిధిలోని సుమారు 45 డీడీఈ స్టడీ సెంటర్ల కో–ఆర్డినేటర్లతో సోమవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి చర్చించారు. పరీక్షల నిర్వహణ వాయిదా వేస్తే కలిగే పరిణామాలు, యథావిధిగా పరీక్షలను నిర్వహించి పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు, వీడియో రికార్డు వంటి ఏర్పాట్లపై చర్చించినట్లు సమాచారం.

పోలీసుల అదుపులో 16 మంది దళారీలు


దళారీలతో మాట్లాడుతున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారుల నుంచి సమాచారం అందడంతో సోమవారం 16 మంది దళారీలను అదుపులోకి తీసుకున్నారు. అయితే ఇంకా కొంతమంది దళారీలు తప్పించుకుని తిరుగుతున్నట్లు సమాచారం. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ నరసింహమూర్తి హెచ్చరించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తులకు మాయమాటలు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారని సమాచారం రావడంతో వారిని స్టేషన్‌కు పిలిపించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమి ఏర్పాట్ల పరిశీలన

తిరుమల : తిరుమలలో ఫిబ్రవరి 4న జరగనున్న రథసప్తమి ఏర్పాట్లను ఎస్పీ వీ.హర్షవర్ధన్‌రాజు పరిశీలించారు. రథసప్తమి భద్రతపై నాలుగు మాడ వీధులు, గ్యాలరీలు, పార్కింగ్ ప్రదేశాల్లో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తిరుమలలో రథసప్తమి ఏర్పాట్లకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. పరిపాలన అదనపు ఎస్పీ జే.వెంకట్రావు, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, ఎస్‌డీఎస్‌పీ వీ.గిరిధర్, తిరుమల డీఎస్పీలు పాల్గొన్నారు.

శ్రీసిటీలో ఎన్‌ఎక్స్ లాజిస్టిక్స్ విస్తరణ


శ్రీసిటీలో విస్తరించిన ఎన్‌ఎక్స్ లాజిస్టిక్స్ ఇండియా


ఎన్‌ఎక్స్ ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ (వరదయ్యపాళెం): జపాన్‌కు చెందిన నిప్పాన్ ఎక్స్‌ప్రెస్ కంపెనీ లిమిటెడ్ అనుబంధ సంస్థ లాజిస్టిక్స్ ఇండియా శ్రీసిటీలోని తన అధునాతన లాజిస్టిక్స్ సదుపాయాన్ని సోమవారం విస్తరింపజేసింది. కార్యక్రమానికి చెన్నైలోని జపాన్ కాన్సూల్ జనరల్ మునేయో తకాహాషి నిప్పాన్ ఎక్స్‌ప్రెస్ హోల్డింగ్ చీఫ్ మేనేజింగ్ ఆఫీసర్ పురో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శ్రీసిటీ తరఫున మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విస్తరణ ఎన్‌ఎక్స్ లాజిస్టిక్స్ ఇండియా మరింత నాణ్యమైన లాజిస్టిక్స్ సేవలను అందించడానికి దోహదపడుతుందని తెలిపారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం


నాగమల్లేశ్వర్‌రెడ్డి, ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్

తిరుపతి క్రైం: కల్లుగీత కార్మికులకు కేటాయించిన 23 మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ సోమవారం నుంచే మొదలుపెట్టామని ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 5వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. ఆ తర్వాత 7న కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ చాంబర్‌లో లాటరీ పద్ధతిలో దుకాణాల ఎంపిక చేస్తారని తెలిపారు. ఇటీవల దుకాణాలు కేటాయించినట్లు కల్లుగీత కార్మికుల్లో ఉపకులాలైన ఈడీగకు 15, గౌడ్‌కు 3, గౌండ్లకు 3, గౌడకు 2 దుకాణాలు ఇస్తున్న చెప్పారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలో 1, మున్సిపాలిటీల పరిధిలో 6, మిగిలిన 16 షాపులను మండలాల పరిధిలో కేటాయించనున్నట్లు గుర్తుచేశారు. తిరుపతి జిల్లా వాసులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. రెండేళ్లపాటు షాపు నడుపుకునే సౌకర్యం ఉంటుందన్నారు. దరఖాస్తు సమయంలో రూ.2 లక్షలు అప్లికేషన్ ఫీజు చెల్లించాలని చెప్పారు. దుకాణం రాకుంటే రీఫండ్‌బుల్ ఉండదని స్పష్టం చేశారు. మొదటి సంవత్సరం నగరం, పట్టణ ప్రాంతాల్లో షాపులకు అయితే రూ.21,66,667, రెండో సంవత్సరం రూ.35,75,000 ప్రభుత్వానికి చెల్లించాలని పేర్కొన్నారు. అలాగే మండల పరిధిలోని షాపులకు మొదటి సంవత్సరం రూ.18,33,334, రెండో సంవత్సరం రూ.30,25,000 చెల్లించాలని వెల్లడించారు.

సచివాలయ భవనానికి నిప్పు

– ఓటేరు పంచాయతీలో గుర్తుతెలియని వ్యక్తుల దుశ్చర్య


మంటలార్పుతున్న అగ్నిమాపక దళం

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, ఓటేరు పంచాయతీలో కొత్తగా నిర్మిస్తున్న సచివాలయానికి కొంతమంది దుండగులు సోమవారం సాయంత్రం నిప్పు పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.40 లక్షల వ్యయంతో సచివాలయ భవనాన్ని నిర్మిస్తున్నారు. అసంపూర్తిగా నిలిచిన ఈ భవనంలో కొందరు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతుండడంతో స్థానికులు భవనం చుట్టూ ముళ్ల కంపలు వేసి తాత్కాలికంగా రక్షణ కల్పించారు. ఆదివారం సాయంత్రం కొందరు వ్యక్తులు ముళ్ల కంపలకు నిప్పు పెట్టారు. దీంతో సచివాలయ భవనానికి సంబంధించి తలుపులు, కిటికీలు కాలిపోయాయి. చంద్రగిరి డీఎస్పీ బేతపూడి ప్రసాద్, తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు, రూరల్ ఎంపీడీవో రామచంద్ర, సర్పంచ్ లక్ష్మి, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు రాజా సచివాలయ భవనాన్ని పరిశీలించారు.

రూ.2.29 కోట్లు గోల్‌మాల్



నిరసన తెలుపుతున్న మహిళలు

- మాజీ సంఘమిత్రల నుంచి వెంటనే రికవరీ చేయండి
- మహిళల డిమాండ్

శ్రీకాళహస్తి: సక్రమంగా బ్యాంకుకు చేరాల్సిన వెలుగు సంఘాల సొమ్ము రూ.2.29 కోట్లు గోల్‌మాల్ అయ్యింది. వెంటనే సంబంధిత సంఘమిత్రల నుంచి ఆ సొమ్మును రికవరీ చేయకుండా, తమకు నోటీసులు ఇవ్వడమేంటని తొట్టంబేడు మండలం, చియ్యవరం గ్రామ మహిళలు మండిపడ్డారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని కలిసేందుకు మహిళలు పీఆర్ అతిథిగృహానికి విచ్చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చియ్యవరం పంచాయతీ పరిధిలోని మాజీ సంఘమిత్రలు మునిలక్ష్మి, మునిశేఖర్ 56 వెలుగు సంఘాల నుంచి బ్యాంకులకు చేరాల్సిన రూ.2,29 కోట్లు పక్కదాని పట్టించారన్నారు. ఆ ఇద్దరు సంఘమిత్రలను అధికారులు విధుల నుంచి తొలగించారని, ఆపై నిధుల రికవరీకి గడువు నిర్దేశించగా.. వారి నుంచి సరైన స్పందన రాలేదన్నారు. గత ఏడాది డిసెంబర్ 23న స్త్రీనిధి రికవరీ క్యాంపు అధికారులు చియ్యవరం గ్రామానికి విచ్చేసి విచారణ చేపట్టినట్టు పేర్కొన్నారు. రూ.2.29కోట్లకు గాను రూ.54 లక్షలు చెల్లించినట్టు గుర్తించారని తెలిపారు. ఈ మేరకు వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. అయితే నెల రోజులు గడుస్తున్నా మాజీ సంఘమిత్రల నుంచి సొమ్ము రికవరీ కాకపోవడం, యూనియన్‌బ్యాంకు నుంచి తమకు నోటీసులు రావడం విడ్డూరంగా ఉందన్నారు.

స్కూళ్లపై పర్యవేక్షణకు క్లస్టర్ విధానం

- రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు


మాట్లాడుతున్న రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వీ.విజయరామరాజు

తిరుపతి కల్చరల్: పాఠశాలలపై పర్యవేక్షణ పెంచేందుకు క్లస్టర్ విధానాన్ని తీసుకొచ్చినట్లు రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ డైరెక్టర్ వీ.విజయరామరాజు తెలిపారు. సోమవారం మహతి కళాక్షేత్రంలో పాఠశాల విద్య బలోపేతం– నూతన విద్యా విధానంపై విద్యాశాఖ డైరెక్టర్ తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, సుమిత్ కుమార్, తిరుపతి, చిత్తూరు జిల్లాల విద్యాశాఖాధికారులు కేవీఎస్.కుమార్, వరలక్ష్మి ఎంఈవోలు, క్లస్టర్ హెచ్‌ఎంలతో కలిసి ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ డైరెక్టర్ మాట్లాడుతూ పాఠశాల విద్యలో తీసుకొస్తున్న మార్పులు, జీవో 117 రద్దు, నూతనంగా తీసుకొచ్చిన క్లస్టర్ విధానంతో కలిగే ప్రయోజనాలు వివరించారు. ఆయా క్లస్టర్ పరిధిలోని స్కూళ్లపై ఆ క్లస్టర్ హెచ్‌ఎం పర్యవేక్షణ చేయడంతో ప్రయోజనం ఉంటుందన్నారు. ఎంఈవోల పవర్స్ వారికే ఉంటాయనిని, ఇకపై తహసీల్దార్లు, ఎంపీడీఓల బదిలీల మాదిరిగానే వారికి ఉంటాయన్నారు. స్కూళ్ల ఎన్‌రోల్‌మెంట్లో తప్పులు ఉంటున్నాయని, వాస్తవమైన వివరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

ప్రతి పంచాయతీలో ఓ మోడల్ స్కూల్

ప్రతి గ్రామ పంచాయతీలో ఓ మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేస్తామని చెప్పారు. విద్యార్థులు తక్కువగా ఉంటే అక్కడి 3, 4, 5 తరగతులను 2.3 కిలోమీటర్ల దూరంలో ఉండే మోడల్ ప్రైమరీ స్కూళ్లకు పంపించేటట్లు అధికారులు తల్లిదండ్రులను ఒప్పించాలన్నారు. పిల్లలకు అవసరమైతే రవాణా చార్జీలు సైతం ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ప్రాథమిక పాఠశాలలను కొనసాగించే ఉద్దేశం లేదన్నారు. ఏకోపాధ్యాయ స్కూళ్లను బేసిక్ ప్రైమరీ స్కూళ్లగా మార్పు చేయాలని ఆదేశించారు. పిల్లలు తక్కువగా ఉన్న చోట రెండు గ్రామాలకు కలిపి ఒకే చోట ప్రాథమిక ఆదర్శ పాఠశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీయూపీ పాఠశాలలో 6,7,8 తరగతులు ఉన్న చోట విద్యార్థుల సంఖ్యను బట్టి ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు. తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్‌డీఓలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కడప ఆర్జేడీ శామ్యూల్, డెప్యూటీ డీఈఓలు పాల్గొన్నారు.